క్లుప్తంగా

సంక్రాంతి సందర్భంగా వ్యాస రచన పోటీలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సంక్రాంతి వేడుకల్లో భాగంగా పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆ సంఘ ఏలూరు నగర కమిటీ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక ఎస్‌పీడీబీటీ కళాశాలలో వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సంఘ నగర అధ్యక్షుడు ఎం.యశ్వంత్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా విద్యార్థులు తప్పుదోవ పట్టకుండా సంక్రాంతి విశిష్టతను తెలుసుకోవడం కోసం తమ సంఘం ఆధ్వర్యంలో ఇటువంటి పోటీలు పెట్టి యువతను ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈ మేరకు సంక్రాంతి పండుగ విశిష్టత – మారుతున్న క్రీడా విష సంస్కృతి అనే అంశంపై ఈ నెల 9,10 తేదీల్లో స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అమీనాపేట ఎస్‌పీడీబీటీ కళాశాలల్లో వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వ్యాసరచన పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మొదటి ముగ్గురికి బహుమతులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నగర ప్రధాన కార్యదర్శి ఎస్. సునీల్, నగర ఉపాధ్యక్షుడు వై. శాంతి కిరణ్ కాలేజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దేవుని ప్రేమను ప్రజలకు పంచాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దైవజనులంతా ఐకమత్యంగా ఉండి ప్రజలకు దేవుని ప్రేమను పంచాలని ఏలూరు కథోలిక పీఠాధిపతి బిషప్ జయరావు పొలిమేర అన్నారు. స్థానిక సీఎస్ఐ చర్చ్ ఆవరణలో ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీ ఆధ్వర్యంలో ఏపీ పాస్టర్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పాస్టర్ పి.జీవన్‌కుమార్ అధ్యక్షతన పాస్టర్స్ ఫ్యామిలీ బ్యాంకెట్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిషప్ జయరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిత్యం దైవాన్ని స్మరించుకోవాలని, తద్వారా శాంతి సమాధానంతో జీవించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ దేవుని సేవకులంతా ఒకే వేదిక పైకి వచ్చి ఐక్యతను చాటడం విశేషమన్నారు. అనంతరం కేకును కట్ చేసి, ప్రేమ విందును ఏర్పాటు చేశారు. నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, సీపీఐ నాయకుడు డేగా ప్రభాకర్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, సీఎస్ఐ సంఘ కాపరి పీ. రత్నరాజు, దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షుడు పెరికే వరప్రసాదరావు, ఫాదర్ మైకేల్ ఇంజమాల, సిటీ పాస్టర్స్ అసెంబ్లీ చీఫ్ పాట్రన్ సీహెచ్ సుభద్రారావు, అధ్యక్షుడు వై. గ్రేస్ జాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఎల్ పాల్ పాల్గొన్నారు.

నేడు నగర సంకీర్తన

దెందులూరు: ధనుర్మాసం పురస్కరించుకుని దెందులూరులో గురువారం ఉదయం 9 గంటలకు నగర సంకీర్తన నిర్వహిస్తామని రామదండు మండల కమిటీ నాయకులు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 4.05 గంటలకు విష్ణు ఆలయంలో ఉత్తర ద్వారదర్శనం కల్పిస్తామని, భక్తులు స్వామివారిని దర్శించుకోవచ్చని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమబాట

- ఉద్యోగులు, కార్మికుల సంక్షేమంపై చిత్తశుద్ధి ఏదీ?
- 12వ పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్
- రూ.21వేలు వేతనం కోరుతున్న ఇంజనీరింగ్ కార్మికులు
- ఏలూరు కార్పొరేషన్ పరిధిలో 10న రిలే నిరాహార దీక్షలు


మస్టర్ పాయింట్ వద్ద తెల్లవారు జామున తమ నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో 2023, డిసెంబరు 26 నుంచి జనవరి 10 వరకు 16 రోజులు రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహించారు. సమ్మె విరమణ సందర్భంగా అప్పట్లో సంబంధిత అధికారులు కార్మిక సంఘాలతో చేసుకున్న ఏ ఒక్క ఒప్పందాన్ని, హామీని అమలు చేయకపోవడంతో మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఆందోళనబాట పట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం 12వ పీఆర్‌సీ ప్రకటించి ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో– 36 ప్రకారం నెలకు రూ.21వేలు వేతనం ఇవ్వాలని, 2023 డిసెంబర్ సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు తక్షణం జీవోలు విడుదల చేయాలని కార్మికులు, ఉద్యోగులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

గత ప్రభుత్వం పంపిన ఫైలును వెనక్కు రప్పించడంపై ఆగ్రహం

రాష్ట్రంలోని మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలపై గతంలో సమ్మె చేసిన సందర్భంగా ప్రభుత్వం తరుపున ఒప్పందాలు కుదుర్చుకున్న అధికారులు ప్రతిపాదనలు తయారు చేసి అప్పట్లోనే ఫైనాన్స్ డిపార్టుమెంట్‌కు పంపించారు. ఈ లోగా ఎన్నికల కోడ్ రావడం ఆ ఫైలు ముందుకు కదలలేదు. ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల ఫైలును ఆమోదించకుండా ఫైనాన్స్ డిపార్టుమెంట్ వద్ద ఉన్న ఫైలును వెనక్కు రప్పించడంపై మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ 2024 డిసెంబర్ 26 నుంచి దశల వారీగా ఉద్యోగులు, కార్మికులు ఆందోళనలు చేపట్టారు. దీనిలో భాగంగా ఈనెల 10న రిలే నిరాహార దీక్షలు చేపట్టాలని యూనియన్ నిర్ణయించింది.

చాలీచాలని వేతనం

మున్సిపల్ కార్మికులకు ఇచ్చేది చాలీచాలని కొద్దిపాటి వేతనమే. అయినా వారితో చేయించేది గొడ్డు చాకిరీనే. ఎప్పటికైనా తమ బతుకుల్లో వెలుగులు రాకపోతాయా? సమస్యలు తీరకపోతాయా? అనే ఆశతో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు మౌనంగా తమ విధులను నిర్వహిస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే కొంతకాలం క్రితం సమ్మె చేసారు. సమస్యల పరిష్కారానికి అధికారులు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. దీంతో మళ్లీ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికులు ఆందోళన బాట పట్టారు. దీనిలో భాగంగా ఇప్పటికే మస్టర్ పాయింట్ల వద్ద తెల్లవారు జామున నిరసన తెలిపారు. ఈ నెల 5న ఏలూరు కార్పొరేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అధికారులకు వినతిపత్రం అందజేసారు. తాజాగా ఈ నెల 10న రిలే నిరాహార దీక్షలు చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు.

90 శాతం మంది ఆప్కాస్ ఉద్యోగులే

ఏలూరు నగర పాలక సంస్థలో పనిచేసే ఉద్యోగులు, కార్మికుల్లో 90 శాతం మంది ఆప్కాస్ ఉద్యోగులే ఉన్నారు. ఏలూరు నగరపాలక సంస్థలో దాదాపు 1,230 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా వీరిలో పర్మినెంట్ ఉద్యోగులు కేవలం 250 మంది మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు 800 మంది, స్కూల్ స్వీపర్లు 120 మంది, క్లాప్ డ్రైవర్లు 60 మంది పనిచేస్తున్నారు. ఈ లెక్కల ప్రకారం దాదాపు వెయ్యి మంది ఉద్యోగులు, కార్మికులు అంతా ఆప్కాస్ ఉద్యోగులే ఉండటం గమనార్హం.

తక్షణం 12వ పీఆర్‌సీ ప్రకటించాలి



రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 12వ పీఆర్‌సీ, ఐఆర్ ప్రకటించాలి. 2023 జూలై నుంచి బకాయిలు చెల్లించాలి. మూడేళ్ల సరెండర్ లీవుల వేతనాలు చెల్లించాలి. మున్సిపల్ కార్మికులు, ఉద్యోగుల పట్ల పాలకులు చిన్నచూపు చూడటం తగదు. గత సమ్మె కాలపు ఒప్పందాల అమలుకు జీవోలివ్వాలి.

– బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు

కుటుంబ పోషణ కోసం ఇబ్బందులు



పారిశుద్ధ్య కార్మికులకు చాలీచాలని వేతనాలు అందిస్తుండటంతో కుటుంబ పోషణ కోసం అనేక ఇబ్బందులు పడుతున్నాం.పెరిగిన నిత్యావసరాల ధరలు, పెంచిన విద్యుత్ చార్జీలు, ఇంటి అద్దెలు ఎంతో భారంగా మారాయి. పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి.

– అంగులూరి జాన్‌బాబు, మున్సిపల్ కార్మికుడు, పారిశుద్ధ్య విభాగం

కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలి



మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులకు జీవో– 36 ప్రకారం కనీస వేతనం రూ.21వేలు ఇవ్వాలి. స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు అమలుకు ప్రభుత్వం నియమించిన కమిటీ సిఫార్సులు అమలు చేయాలి. వారాంతపు సెలవులు, జాతీయ, పండుగ సెలవులు, సీఎల్‌లు అమలు చేయాలి.

– కలం సాంబశివరావు, ఇంజనీరింగ్ విభాగం వర్కర్

కళాశాల విద్యార్థులకు కౌన్సెలింగ్

ఏలూరు టౌన్: కళాశాలకు వెళ్తున్నామంటూ ఇంట్లోంచి బయటకు వచ్చిన విద్యార్థులు ఏలూరు నగరంలో ఆయా పార్కుల్లో దర్శనమిస్తున్నారు. ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్సై క్రాంతిప్రియ, సిబ్బంది పార్కుల్లో తిరుగుతూ కళాశాలలకు డుమ్మా కొట్టి పార్కుల వెంబడి తిరుగుతున్న విద్యార్థినీ విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అభయ పోలీస్ రక్షక దళం పార్కులను సందర్శిస్తూ అక్కడ విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. పార్కుల్లో తిరుగుతున్న విద్యార్థుల వివరాలను ఆరా తీసి ఆయా కళాశాల యాజమాన్యాలతో సంప్రదించి మరోసారి ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని సీఐ సుబ్బారావు వారికి చెప్పారు.

అంధుల సంఘ నేతల కోరిక మేరకే కలెక్టర్ రాక

ఏలూరు (టూటౌన్): కలెక్టర్ రాక కోసం నిరీక్షణ అనే వార్తపై వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ బి.రామ్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. ఈనెల 7న కలెక్టరేట్‌లో లూయీ బ్రెయిలీ జయంతి వేడుకలు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించామన్నారు. సుదూర ప్రాంతం నుంచి అంధులు హాజరు కావాల్సి ఉన్నందున అంధుల సంఘం నాయకులు కలెక్టర్‌ను మధ్యాహ్నం 12 గంటలకు హాజరు కావాల్సిందిగా కోరారన్నారు. దానికి అనుగుణంగా ముందస్తు షెడ్యూల్ ప్రకారం కాకుండా అంధుల సంఘ నాయకుల కోరిక మేరకు కలెక్టర్ కార్యక్రమంలో పాల్గొన్నారని ఏడీ రామ్‌కుమార్ తెలిపారు. తమ అసోసియేషన్ కోరిక మేరకు కలెక్టర్ మధ్యాహ్నం 12 గంటలకు ముందుగానే బ్రెయిలీ జయంతి కార్యక్రమానికి హాజరయ్యారని విజువల్లీ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జీడీవీఎస్ వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.మదన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో హారతి పాశురం


హారతి పాశురంలో పాల్గొన్న భక్తులు


చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న శ్రీవారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన ఆధ్యాత్మిక, కూచిపూడి నృత్య కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, నిత్యార్చన నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి విశేష అలంకరణ చేశారు. అనంతరం తిరుప్పావై పాశుర విన్నపాల్లో భాగంగా గోదాదేవి శ్రీ వారికి సమర్పించిన మంగళ హారతి దినోత్సవాన్ని పురస్కరించుకుని హారతి పాశురం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విశేష హారతులు సమర్పించారు. ఉదయం స్వామి వారి నిత్య కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సాయంత్రం 5.30 గంటలకు తాడేపల్లిగూడెంకు చెందిన ముదపాక బాలసుందరం భాగవతార్ శ్రీ మద్విరాట పర్వం అనే అంశంపై హరికథా కాలక్షేపం చేశారు. రాత్రి 7.30 గంటల నుంచి కోనెటోయిన సోహిత సుబ్బలక్ష్మి నృత్య ప్రదర్శన, అనంతరం రాత్రి 8 గంటల నుంచి నగరానికి చెందిన మేదరమెట్ల శిరీష శిష్య బృందం కూచిపూడి నృత్యాలు ప్రదర్శించారు. ఆలయ అర్చకులు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు విశేష పూజలు నిర్వహించగా ఆలయ కార్యనిర్వహణాధికారి నల్లూరి సతీష కుమార్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ప్రజా సంక్షేమం కోసం సాబ్జీ కృషి


ఎమ్మెల్సీ సాబ్జీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ నేతలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): దివంగత ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ తన జీవిత కాలంలో ప్రజా సంక్షేమం కోసమే పని చేశారని ఆర్టీసీ బహుజన ఉంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ షేక్ ఫరీద్ ఖాసిమ్ అన్నారు. బుధవారం స్థానిక ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘ కార్యాలయంలో దివంగత షేక్ సాబ్జీ 59వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖాసిమ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఉద్యమ నాయకునిగా జిల్లా, రాష్ట్రస్థాయిలో పోరాటాలు చేసిన సాబ్జీ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో అనేక విజయాలు సాధించారన్నారు. సామాజిక సేవ కోసమే ఉపాధ్యాయునిగా 5 సంవత్సరాల సర్వీసు ఉన్నప్పటికీ రూ.1.50 కోట్ల ఆదాయాన్ని త్యజించి ఎమ్మెల్సీగా సేవలకు ముందుకు వచ్చారన్నారు. 2019లో సీపీఎస్ రద్దు కోరుతూ ఏలూరు నుంచి విజయవాడ వరకూ నిర్వహించిన పాదయాత్రకు సాబ్జీ నాయకత్వం వహించారని, పేద పిల్లల విద్యాభ్యాసం కోసం, పేద వర్గాల పిల్లల వివాహాల నిమిత్తం లక్షలాది రూపాయలు గుప్తదానం చేశారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు మేతర అజయ్‌బాబు, రాష్ట్ర కార్మిక వెల్ఫేర్ కమిటీ అధ్యక్షుడు దేవరపల్లి రత్నబాబు, ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకుడు టీ. రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు


గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాలు అందచేస్తున్న గుడిమెట్ల అచ్యుత బృందం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యురాలు గుడిమెట్ల అచ్యుత, సత్యదేవ్ దంపతులు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమతున్న యువత కోసం రూ. 30 వేల విలువైన పుస్తకాలను గ్రంథాలయ ప్రతినిధులకు బుధవారం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం. శేఖర్‌బాబు మాట్లాడుతూ దాతల ఔన్నత్యాన్ని ప్రశంసించారు. గ్రూప్ పరీక్షలకు, డీఎస్సీ వంటి పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అభ్యర్థులకు అందుబాటులోకి వచ్చాయని, వాటిని సద్వినయోగం చేసుకుని అభ్యర్థులు మంచి ఉద్యోగాలు సాధించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ రత్నం, కే. ఉష, డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. నారాయణ రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటి సందీప్ కుమార్, జిల్లా కేంద్ర గ్రంథాలయం సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

వణికిస్తున్న చలి పులి


జాతీయ రహదారిపై భీమడోలులో పొగమంచు

భీమడోలు: కొన్ని రోజులుగా ఉష్ణోగ్రత్తలు గణనీయంగా పడిపోవడంతో చలి తీవ్రత పెరుగుతుంది. ఉదయం 9 గంటలకు కూడా పొగమంచు వీడడం లేదు. దీనితో వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్నారు. సాయంత్రం ఐదు గంటలకే చలి పులి విజృంభిస్తోంది. దీనితో రైతులు, వృద్ధులు, చిన్నారులు, మహిళలు, అనారోగ్యం బారిన పడిన వారంతా ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు పొగమంచుతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక ఉష్ణోగ్రతలు పడిపోవడంతో ఆస్తమా, కోరింత దగ్గు, చర్మ వ్యాధులు, జలుబు, వాటి రోగాలు చుట్టుముడుతున్నాయి. వాటి బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆహార నియమాలను పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	31
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	21.15	4822	21
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	24
ఏలూరు–బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	26
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	25
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	22
ఏలూరు – తిరుపతి	16.00	4830	34

సంగీత, సాహిత్య, నృత్య, నాటిక ప్రదర్శనకు ఏర్పాట్లు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన సాహిత్య మండలి, శ్రీ రామకృష్ణ సేవా సమితి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకూ జాతీయ యువజన దినోత్సవం, సంక్రాంతి సాహిత్యోత్సవ సభ కార్యక్రమాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, సంగీత, సాహిత్య, నృత్య, నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు సాహిత్య మండలి ప్రధాన కార్యదర్శి వుల్లాభొట్ల పురుషోత్తమ రావు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 11న స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి ముగ్గుల పోటీలు, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా హైస్కూల్ విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు ఈ నెల 13న నిర్వహించే కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేస్తామన్నారు. 12న ఉదయం 9.30 గంటలకు గండికోట రాజేష శిష్య బృందం ఆధ్వర్యంలో స్వాగత నృత్యాంజలి, అనంతరం కిళాంబి పూర్ణశ్రీ పిట్టల దొర ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం సభా కార్యక్రమం జరుగుతుందని, అనంతరం శ్రీరామ్ నగర్ ఎంపీయూపీ స్కూల్ విద్యార్థులు కోలాట ప్రదర్శన, కే. భాస్కర్ రచన, దర్శకత్వంలో ఎక్కడివారు అక్కడే అనే లఘు నాటిక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. 13న ఉదయం పూజా కార్యక్రమం, అనంతరం వీ. రేవతి సంగీత కార్యక్రమం ఉంటుందన్నారు. అనంతరం మేలాపురి కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ సౌజన్యంతో చిటారుకొమ్మన మిఠాయి పొట్లం హాస్య నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: మండలం పరిధిలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల దృష్టికి వచ్చిన అర్జీలను 45 రోజుల్లో పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం దెందులూరు తహసీల్దార్‌కార్యాలయంలో ఆమె మాట్లాడారు. భూ సంబంధిత సమస్యలపై గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభల్లో బాధితులు అర్జీలు అందజేశారన్నారు. ఉన్నతాధికారుల సూచనలు సలహాలు నిబంధనలకు అనుకూలంగా డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది సహాయ సహకారాలతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	56
వంకాయలు (కాంతులు)	48	బ్భీక్షచిక్కుడు	88
వంకాయలు (తెలుపు)	36	చామదుంపలు	40
బెండకాయలు	48	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	68
కాకర కాయలు	40–44	బీట్‌రూట్	48
బీరకాయలు	40	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	52	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	28	అల్లం	60
క్యారెట్	48	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	48	పాలకూర	10
బంగాళదుంపలు	30–36	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	40	గోంగూర	07
దోసకాయలు	34–40	పుదీనా	05
ఆనపకాయ (1)	25–30	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20–25	చిలకడదుంప	44

రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

భీమడోలు: రైతులు పంటల బీమా పథకం ప్రీమియంను విధిగా చెల్లించాలని, తద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయ శాఖ భీమడోలు ఏడీఏ డాక్టర్ పి.ఉషారాజకుమారి అన్నారు. భీమడోలు రైతు భరోసా కేంద్రం 3 వద్ద బుధవారం సాయంత్రం భీమడోలు సబ్ డివిజన్ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని వ్యవసాయ గ్రామ సహాయకులు, ఉద్యానవన గ్రామ సహాయకులకు కెపాసిటీ బిల్డింగ్‌లో శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎరువులు, పురుగు మందుల వాడకం, పథకాల అమలు, ఈ పంట, పంటల బీమా తదితర అంశాలపై వివరించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పి.ఉషారాజకుమారి మాట్లాడుతూ పంటల బీమా పథకం ప్రీమియంను ఈనెల 15వ తేదీలోగా ప్రతి రైతు చెల్లించాలని, వరి ఎకరాకు రూ.500, మినుముకు రూ.60 చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. దాళ్వా సాగు ప్రారంభం కావడంతో రైతులు పండించే పంట వివరాలను ఈ పంటలో నమోదు కార్యక్రమం చేపట్టి, రైతుల నుంచి ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఏవోలు ఎస్‌పీవీ ఉషారాణి, ప్రవీణ్ పాల్గొన్నారు.

వారధి నిర్మాణ పనులు చేపట్టరా?


గుండుగొలను వద్ద నిలిచిన వంతెన నిర్మాణ పనులు

భీమడోలు: జాతీయ రహదారికి అనుసంధానంగా గుండుగొలను వద్ద గోదావరి కాల్వపై నిర్మిస్తున్న వంతెన పనులు నిలిచిపోయాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో నెలరోజులుగా వంతెన నిర్మాణ చివరి దశ పనులు జరగడం లేదు. జనవరి నెల రెండవ వారం నాటికి వంతెన పనులు పూర్తి చేస్తామని ప్రకటించిన సంబంధిత అధికారులు మౌనం వహిస్తున్నారు. దీనితో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గత నెలలో కీలక ఘట్టమైన వంతెన వద్ద ఫిల్లర్లపై గడ్డర్లను బిగించారు. ఆ తర్వాత సెంట్రింగ్ పనులు చేపట్టాల్సి ఉండగా వివిధ కారణాలను సాకుగా చూపుతూ ఆపనులు నిలిపి వేసారు. దీనితో వంతెన నిర్మాణ పనులు ఎక్కడి గొంగళి అక్కడే అనే చందంగా మారాయి. ఈ వంతెన నిర్మాణం ఏడాదిన్నర కాలంగా నుంచి సాగుతుంది. ఈనెల రెండో వారంలో పనులు పూర్తి చేస్తామని చెప్పిన అధికారులు సెంట్రింగ్ పనులు చేయకపోవడంతో వంతెన నిర్మాణం ఎప్పటికి పూర్తి అవుతుందోనన్న అనుమానం వ్యక్తమవుతుంది. దీనితో ఈ వంతెన నుంచి రాకపోకలు సాగించే 15 గ్రామాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.